


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,10 అక్టోబర్ 2025

8 పేజీలు


# మీరు తిడితే నేను పడతా



## పవన్ కళ్యాణ్ భావోద్వేగం

మత్స్యకారులకు న్యాయం చేయలేకపోతే తాను రాజకీయాలు వదిలేస్తానని చాలా ఉద్వేగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ అన్నారు... న్యాయం చేస్తామని చెప్పి పబ్బం గడుపుకునే రాజకీయ నాయకుల ఉచ్చులో పడవద్దని పవన్ కళ్యాణ్ మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు. మీరు తిడితే నేను పడతాను...నా భుజం మీద దెబ్బ కొడితే పడతాను అంటూ తాను వారి కోసమే ఉంటానని చిత్తశుద్ధిని తెలియజేశారు పవన్ కళ్యాణ్..మత్స్యకారులకు సంపూర్ణ న్యాయం చేస్తానని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మత్స్యకారులకు బహిరంగ సభ వేదికగా మాటిచ్చారు.

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

- ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తా
- చేపల వేటపై ఆధారపడిన మత్స్యకార కుటుంబాలకు డిప్యూటీ సిఎం హామీ
- సముద్రంలోకి వెళ్ళి స్వయంగా కాలుష్యాన్ని పరిశీలిస్తా
- వందరోజుల్లో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తా
- మీకు న్యాయం చేయలేకపోతే... రాజకీయాలు వదిలేస్తా : పవన్ కళ్యాణ్



కాలుష్య నియంత్రణకు, తీర రక్షణకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ఉప్పాడలో మత్స్యకార సమస్యలను సానుకూలంగా పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్యకారుల జీవనోపాధికి కలిగే ఇబ్బందులను తాను అర్థం చేసుకోగలనని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ..గత పది రోజుల క్రితం పరిశ్రమల కాలుష్యం వల్ల చేపల వేట దెబ్బతింటోందని,

- తరువాయి 2లో..

## బాణాసంచా తయారీ కేంద్రాలపై విస్తృత తనిఖీలు

- రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో బాణాసంచా మృతదేహాల పరిశీలన
- మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటాం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం శ్రీ లక్ష్మి గణపతి బాణాసంచా కేంద్రంలో జరిగిన అగ్ని పమాదంలో మృతి చెందినవారి పార్థివ దేహాలను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం రామచంద్రపురం లోని ఏరియా ఆసుపత్రిలో పరిశీలించారు.బాణాసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరుకోవడం పట్ల మంత్రి సుభాష్ విచారం వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న మృతుల

- తరువాయి 2లో..

## వైభోగం వాడపల్లి వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవం

- నేటి నుండి వాడపల్లి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు
- సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దిన దేవస్థానం









**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు 10 నుండి 18 వరకు మునుపెన్నడూ జరగని రీతిలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు లు తెలిపారు. ఉత్సవాల రోజుల్లో నిత్యం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పూజా కార్యక్రమాలు ఉంటాయని, వివిధ ప్రాంతాల నుండి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల క్రతువును పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల నేతృత్వంలో ఘనంగా జరగనున్నాయి, నిత్యం వాహన సేవలు ఉంటాయన్నారు. ఆలయ పరిసరాలన్నీ విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 10న ఉదయం స్వస్తివాచనము,విశ్వక్సేనపూజ, పుణ్యాహ వచనము, ఋత్విక్ వరుణ దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠాపన, ఆకల్మష హోమము, దిగ్ దేవతా బలిహరణ, విశేషార్చన, సాయంత్రం విశ్వక్సేన పూజ,పుణ్యాహవచనము, మృత్సంగ్రహణ,శాలా విహరణ అంకురార్పణ, వాస్తుపూజ, త్రేతాగ్ని ప్రణయము, అగ్ని మథనము, వాస్తు హోమము, ధ్వజారోహణ బలిహరణ, నీరాజనం మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ,రాత్రి పరావాసుదేవ అలంకరణలో శేషవాహన సేవ, 11న ఉదయం సంకల్పము,విశ్వక్సేన పూజ, పుణ్యా వచనము, సప్త కలసారాధన, అభిషేకము, ప్రధాన హోమములు, దిగ్దేవతా బలిహరణ, మహా పుష్పయాగము, నీరాజనం మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం స్వస్తి వచనము, ప్రధాన హోమములు, సహస్ర దీపాలంకరణ సేవ, దిగ్దేవత బలిహరణ, సరస్వతి అలంకరణతో హంస వాహన సేవ, 12న ఉదయం మహా సుదర్శన హోమము, తోమాల సేవ,సాయంత్రంకోదండరామ అలంకరణతో

- తరువాయి 2లో..

# మీరు తిడితే నేను పడతా

**మొదటిపేజి తరువాయి**

మత్స్యజాతి అంతరించిపోతోందని మత్స్యకార సోదరులు చేపట్టిన ధర్నాల పట్ల ఉప ముఖ్యమంత్రి బాధ వ్యక్తం చేశారు. ఈరోజు ఉదయం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ గారి అధ్యక్షతన అన్ని పార్టీల నాయకులతో, మత్స్యకార సంఘాల నాయకులతో కూర్చొని కూలంకషంగా చర్చించినట్టు తెలిపారు. మత్స్యకారుల భరోసా కింద వేట నిషేధ సమయంలో రూ. 20 వేలు భృతి అందించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సముద్రంలో వేటకెళ్లి ప్రాణాలు కోల్పోయిన 18 మంది కాకినాడ జిల్లా మత్స్యకార కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందలేదని తెలిసి, తక్షణమే ఐదుగురికి అందజేశానని, మిగిలిన 13 మందికి రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 90 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

నక్కపల్లి ఎస్ఈజెడ్, తునిలోని దివీస్, అరబిందో వంటి పరిశ్రమల నుండి వెలువడుతున్న కాలుష్యం వల్ల మత్స్య సంపద అంతరించిపోవడం ప్రధాన సమస్య అని గుర్తించారు. ఉప్పాడ రక్షణ గోడ నిర్మాణం అత్యవసరమని, దీని కోసం కేంద్ర ప్రభుత్వానికి రూ.323 కోట్ల ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. ఈ నెల 14న ఢిల్లీలో కేంద్ర గృహ సహాయక కార్యదర్శి ఆధ్వర్యంలో జరగబోయే సమావేశంలో దీనిపై చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. "ఉప్పాడ సీ ప్రొటెక్షన్ వాల్ ఖచ్చితంగా నిర్మించబడుతుంది" అని స్పష్టం చేశారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉప్పాడ నుండి కొనపాపపేట వరకు రూ. 5.65 కోట్లతో తీర రక్షణ పనులు చేపడుతున్నట్లు తెలియజేశారు. మూలపేట హార్బర్‌లో డిజైన్ లోపం వల్ల పడవలకు నష్టం జరుగుతోందని, దీనిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇతర ప్రాంతాలకు వేటకు వెళ్లే ఉప్పాడ మత్స్యకారులకు స్థానిక మత్స్యకార సంఘాలతో ఏర్పడే గొడవలపై కూడా దృష్టి సారించినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ – పరిశ్రమలు కాలుష్యంపై మాట్లాడుతు.. తాను ఎన్విరాన్‌మెంట్ మినిస్టర్‌గా, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు బాధ్యత తీసుకున్న తర్వాత పరిశ్రమలను భయపెట్టకుండా, వాటిని సరైన మార్గంలో నడిపించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదని, అవి అభివృద్ధికి, ఉపాధికి అవసరమని, అయితే అవి కాలుష్యం కలిగించకూడదని మత్స్యకార సంఘాలు కోరినట్లు పేర్కొన్నారు. కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేయకుండా సముద్రంలో కలపడం వల్లనే మత్స్య సంపద దెబ్బతింటోందని, ఇది వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో ప్రారంభించిన పరిశ్రమల నుండి వచ్చిన సమస్య అని వివరించారు. "వ్యర్థాలను, కాలుష్యాలను ఎంత శుద్ధి చేసి పంపుతారు అన్నదే మా ప్రశ్న" అని స్పష్టం చేశారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికకు విజ్ఞప్తి పరిశ్రమల కాలుష్యం, ఇతర మత్స్యకార సమస్యల పరిష్కారానికి ఒక ప్రాపర్ యాక్షన్ ప్లాన్ రూపొందించడానికి కనీసం 100 రోజుల సమయం కావాలని ఉపముఖ్యమంత్రి మత్స్యకారులను కోరారు. "మూడు నెలల నుండి 100 రోజుల సమయం కావాలి. ఆ 100 రోజుల్లో నేను ఒక రోడ్ మ్యాప్, ఒక పరిష్కార మార్గం సిద్ధం చేసి, అవసరమైతే క్యాబినెట్‌లో, అసెంబ్లీలో కూడా మాట్లాడి మీకు న్యాయం జరిగేలా ముందుకు తీసుకెళ్తాను" అని అన్నారు. తాను స్వయంగా పడవలో వెళ్లి కాలుష్యం ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తానని, పరిశ్రమల పొల్యూషన్ ఆడిట్ చేయిస్తానని హామీ ఇచ్చారు.

తక్షణ పరిష్కారాలు లేదా స్వల్పకాలిక ప్రయోజనాల కోసం తప్పుడు హామీలు ఇవ్వబోనని, పర్మనెంట్ సొల్యూషన్ కోసమే కృషి చేస్తానని స్పష్టం చేశారు. "నేను మీ చేత తిట్లు తినడానికైనా సిద్ధం కానీ, బ్యాక్ డోర్ పనులు చేయను" అని తెలిపారు. ప్రతి 10 రోజులకు ఒకసారి మత్స్యకారుల కమిటీతో చర్చించి పురోగతిని తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఇది తన మొదటి సమావేశమని, మత్స్యకారుల సమస్యను సంపూర్ణంగా అర్థం చేసుకున్నానని, ఒక డిప్యూటీ సీఎంగా కాకుండా, ఎమ్మెల్యేగా కాకుండా, వారిలో ఒకడిగా ఉండి సమస్యను పరిష్కరిస్తానని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ పట్టణం ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి...

**దుళ్ల గ్రామంలో హై స్కూల్ నందు వాలీబాల్, బ్యాట్మెంటన్ కోర్టులను ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల...**

**దుళ్ల, మేజర్ న్యూస్ :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, క్రీడల ద్వారా ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతతను పొందవచ్చని రూరల్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. పాఠశాల క్రీడా స్థలాన్ని శుభ్రపరిచి విద్యార్థులకు ఆటలు ఆడుకునే విధంగా రూపుదిద్దాలని ఎమ్మెల్యే గోరంట్ల తన స్వీయనిధులు లక్ష రూపాయలు కేటాయించిన విషయం తెలిసినదే. ఈరోజు స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల క్రీడా మైదానాన్ని శుభ్రం చేసి, విద్యార్థులు ఆడుకునే విధంగా ఏర్పాటుచేసిన, వాలీబాల్, బ్యాట్మెంటన్ కోర్టులను ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు కావలసిన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందని, విద్యార్థులు తమ లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని అన్నారు. ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని, తల్లితండ్రులు పిల్లల చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ఆటల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎం.పీ.పీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, ఏ.పీ.ఐ.ఐ.సీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, గుర్రపు సత్యనారాయణ, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, చిట్టూరి అమ్మిరాజు, ముద్రగడ జెమ్మి, సూరపురెడ్డి భరత్, స్కూల్ కమిటీ సభ్యులు చింత శ్రీను, గోపి ప్రసాద్, యన్నమణి లక్ష్మీపతి, చిట్టూరి వెంకన్న చౌదరి, కాయలు సత్యనారాయణ, కంటిపూడి శ్రీను, కొలపాకుల సత్తిబాబు మరియు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం













**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉదయం కాకినాడ ఎస్పీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ప్రభుత్వ విప్ లు దాట్ల సుబ్బరాజు, యనమల దివ్య, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ పట్టణం ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాసు, డీఎఫ్వో రామచంద్రరావు పూల బొకేలు ఇచ్చి, దుశ్శాలువాలతో స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి కాకినాడ కలెక్టరేట్‌లో ఉప్పాడ మత్స్యకార సోదరులతో మాట–మంతి కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# బాణాసంచా తయారీ కేంద్రాలపై విస్తృత తనిఖీలు

**మొదటిపేజి తరువాయి**

కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి సుభాష్ మీడియాతో మాట్లాడుతూ బాణాసంచా కేంద్రం వద్ద శాంపిల్స్ సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామన్నారు. బాణాసంచా తయారీకి సంబందించిన అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికిఈ ప్రమాదం జరగడం, ఈ ప్రమాదంలో యజమానితో సహా ఎనిమిది మంది మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. బాణాసంచా తయారీ కేంద్రం తమశాఖ పరిధిలోనికి రాకపోయినప్పటికి మృతుల కుటుంబాలకు ఎస్‌డిఆర్ఎఫ్, ఇన్సూరెన్స్, చంద్రన్న భీమా తదితర పథకాలతోప్రభుత్వపరంగా ఆదుకుంటామ న్నారు. దీపావళి సందర్భంగా బాణాసంచా తయారీ కేంద్రాల యజమానులు అన్ని జాగ్రత్తలు తీసుకునేవిధంగా చర్యలు, విస్తృత తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. మంత్రి సుభాష్ వెంట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఉండవిల్లి శివ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దంగేటి గౌరీ శంకర్, పలువురు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వైభోగం వాడపల్లి వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవం

**మొదటిపేజి తరువాయి**

హనుమద్‌వాహన సేవ, 13న ఉదయం జగత్ కల్యాణ నిమిత్తము శ్రీనివాస కళ్యాణం, సాయంత్రం యోగ నరసింహ అలంకరణతో సింహ వాహన సేవ, 14న ఉదయం అష్టదళ పాదపద్మారాధన, సాయంత్రం హనుమత్ మూలమంత్ర హవనము, అష్టోత్తర శతకలసారాధన, పంచ సయ్యాదివాసనము, మలయప్ప అలంకరణతో గరుడ వాహన సేవ, 15న సుప్రభాత సేవ అష్టోత్తర శత కలశాభిషేకము, లక్ష తులసి పూజ, శ్రీకృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ, సాయంత్రం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర మూలమంత్ర పూర్వక వెంకటేశ్వర హోమం, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ, 16న తిరుప్పావడ సేవ రాజాధిరాజ అలంకరణతో గజవాహన సేవ, 17న గోదావరి నది జల సంగ్రహణము, లక్ష కుంకుమార్చన, శ్రీ స్వామివారికి ఉభయదేవేరులతో కల్పవృక్ష వాహన సేవ, మహాలక్ష్మి మంత్ర పూర్వక చూర్ణోత్సవము, కల్కి అలంకరణతో అశ్వ వాహన సేవ, 18న మహా పూర్ణాహుతి, చక్ర స్నానం, మహాద్వాశీరచనము, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరగనున్నాయి. రాష్ట్రంలోని మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. కార్యక్రమాలను తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు వస్తున్నందున వారికి తగ్గ ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తజనానికి స్వామివారి దర్శనం సులభతరంగా ఉండేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నారని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, శానిటేషన్ సవ్యంగా జరిగేలా, తాగునీరు, అన్న ప్రసాదం అందరికీ అందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కళ్ళు మిరిమిట్లు గొలిపేలా బ్రహ్మాండమైన లైటింగ్ ఏర్పాట్లు జరిగాయన్నారు. స్వామివారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించడం జరిగిందన్నారు. అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయని, గత సంవత్సరం కంటే విశేష సంఖ్యలో ఈ సంవత్సరం భక్తులు తరలి రానున్నారని ఆయన వ్యాఖ్యానించారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలు ఉచిత బస్సు పథకాన్ని వినియోగించుకుంటూ అశేష సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ఉచిత బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు గ్రామాల్లో బస్సులు బయలుదేరి వాడపల్లి తరలి వస్తాయన్నారు. తిరిగి రాత్రి 8 గంటలకు ఈ బస్సులు వాడపల్లి నుంచి బయలుదేరుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తిరుమలలో ఏ విధంగా అయితే బ్రహ్మోత్సవాలు, వాహన సేవలు నిర్వహిస్తారో అదేవిధంగా వాడపల్లిలో వాహన సేవలు, బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారని, అక్కడికి వెళ్లి దర్శించుకోలేనివారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని భక్తులు ప్రజలు వాడపల్లి తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఎక్కడెక్కడ నుంచో తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# కాకినాడ జిల్లా స్థాయి తపాలా బిళ్ళల ప్రదర్శన - పిలాటరీ ఎగ్జిబిషన్






**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు చేతుల మీదుగా ప్రారంభమైన జిల్లా స్థాయి తపాలా బిళ్ళల ప్రదర్శన– పిలాటరీ ఎగ్జిబిషన్ గురువారం రెండో రోజు కొనసాగింది. ఎన్నో అత్యద్భుతమైన, అతి ప్రాచీనమైన, వివిధ రకాల మేలైన, అరుదైన స్టాంపుల సేకరణ సమాహారం ఈ ప్రదర్శన యొక్క విశిష్టత కాకినాడ నగరములోని అన్ని పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఔత్సాహికులు, ప్రజలు ఒక సంద్రంలా కదలి వచ్చి ఈ సంరంభాన్ని ఎంతో ఆసక్తిగా, ఉత్సాహముగా తిలకించారు.ముగింపు వేడుకలకు జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ ఉపకులపతి ప్రొ.చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఎప్పుడూ చూడని అరుదైన కలెక్షన్లు ఉన్నాయని, ఈ తపాలా బిళ్ళల అపురూప ప్రదర్శనను చూసి మంత్రముగ్ధులయ్యానని తెలిపారు. ఈ ముగింపు వేడుకలకు విచ్చేసిన జి.శివ నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిలాటలీ), ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ వారు మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థులకు ఫిలాటలీ కళ పట్ల అవగాహనను సవివరముగా చెప్పారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు తరచూ జరుగుతూ ఉంటే ఫిలాటలీ కళ ఎప్పటికీ సజీవంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

అలాగే ఈ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రదర్శనలను పారదర్శకముగా ఎంపిక చేసిన జ్యూరీ, న్యాయ నిర్ణేతలు అనూప్ కుమార్ రౌత్, దేవేందర్ కుమార్ జైన్ మాట్లాడుతూ ఎంతో ఉత్సాహముగా పాల్గొని, విజేతలుగా నిలిచిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు మరియు పాఠశాలల యాజమాన్యం మరియు అధ్యాపకులు పిల్లలకు ఈ కళ పట్ల అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.అలాగే ఈ ఎగ్జిబిషన్‌లో గెలుపొందిన ఫిలాటలిస్ట్‌లకు, ఈ ఎగ్జిబిషన్ సందర్భముగా నిర్వహించిన వ్యాస రచన పోటీలు, చిత్రలేఖనం పోటీలు మరియు క్విజ్ పోటీలలోని విజేతలకు ప్రొఫెసర్ చేకూరి శివ రామకృష్ణ ప్రసాద్, జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ ఉపకులపతి చేతుల మీదుగా బహుమతి ప్రధాన కార్యక్రమం జరిగినది.

# షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన సింధూర

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ (జేఎన్‌టీయూకే), యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ (యుసిఈకె)కు చెందిన కె.సింధూర సాహితి, ఎఐఎంఎల్ రెండవ సంవత్సరం విద్యార్థిని, 8వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ – 2025లో మూడవ స్థానం (బ్రాంజ్ మెడల్) సాధించింది. ఈ ఛాంపియన్‌షిప్ సెప్టెంబర్ 25 మరియు 26 తేదీల్లో కర్నూల్‌లో ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్రం లోని వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో, సింధూర సాహితి తన అద్భుతమైన ప్రతిభతో ప్రదర్శన ఇచ్చి విశేష ప్రశంసలు అందుకుంది.జేఎన్‌టీయూకే వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మరియు స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ డా.ఎ.కృష్ణ మోహన్ ఈ విజయానికి సింధూర సాహితిని అభినందించారు. వారు మాట్లాడుతూ, “విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ



చూపడం విశ్వవిద్యాలయ గర్వకారణం. సింధూర సాహితి సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శప్రాయమైనది” అని అన్నారు

# ఏపీఎస్‌పీ బెటాలియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ దత్తత తీసుకున్న ఎస్‌బిఐ

- పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రీజనల్ మేనేజర్ కృష్ణ హామీ
- 13 కంప్యూటర్లను స్కూలుకు అందజేత
- కృతజ్ఞతలు తెలిపిన కమాండెంట్ ముద్రగడ నాగేంద్ర

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** రమణయ్యపేటలో గల మూడవ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దత్తత తీసుకోనునట్లు బ్యాంక్ రీజనల్ మేనేజర్ కృష్ణకుమార్ తెలిపారు. గురువారం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూలుకు కావలసిన కంప్యూటర్లు, మౌలిక సదుపాయా లను కల్పించాలనే ఉద్దేశంతో ఇప్పుడు 13 కంప్యూటర్లలో అందజేయడం జరిగిందని మరో 17 అందిస్తామని తెలిపారు. ఈ స్కూలుకు కావలసిన పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ముద్రగడ నాగేంద్రరావు మాట్లాడుతూ మేము చేసిన విజ్ఞప్తి మేరకు స్కూలుకు కంప్యూటర్ అందించినందుకు ఎస్‌బిఐ ను అభినందించారు. అదేవిధంగా ఈ పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయు లకు కూడా బ్యాంకు నుండి సహాయ సహకారాలు కావాలని కోరారు. కావలసిన సదుపాయాలపై కూడా వివరించారు. పరిశీలించి




తప్పనిసరిగా సదుపాయాలు, కావలసిన సహకారాలు అందిస్తానన్నారు. అదేవిధంగా 10 మంది విద్యార్థులకు సైకిల్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలీస్ బ్యాండ్ ఎన్‌సిసి డ్రిల్‌తో కమాండెంట్ రీజనల్ మేనేజర్ కృష్ణులకు ఘన స్వాగతం పలికి స్కూల్ విద్యార్థులు అందర్నీ ఆకర్షి తులను చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.మన్మధరావు, చంద్రశేఖరరావు, డి.వి.వి.ప్రసాద్, ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్, సిహెచ్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జీఎస్టీ పై అవగాహన కార్యక్రమం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం పిహెచ్సి ఆధ్వర్య ంలో గురువారం సూపర్ జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ విజయ భాను మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకువచ్చిన కొత్త సంస్కరణల వల్ల ప్రతి వైద్య ఆరోగ్య శాఖకు ఎంతో ప్రయోజనం కలగనుందన్నారు. ఈ మార్పుల ద్వారా ఆరోగ్య ఖర్చులు తగ్గి ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. సెక్రటరీ ధర్మేంద్ర మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాలపై జీఎస్టీ మినహాయింపు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అరుణ కుమారి తదితరులు ఉన్నారు.

# రూ.20 వేలు ఆర్థిక సహాయం చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** అనారోగ్య సమ స్యలతో బాధపడుతున్న ఒక వ్యక్తికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించి ఆపన్న హస్తం అందించారు. వివరాల్లోకెళితే రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు కరణంపేటకు చెందిన కొప్పిశెట్టి అన్నారం అనారోగ్యంతో బాధపడుతున్నారు. కూటమి పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి ఆయన ఇంటికి నేరుగా వెళ్లి పరామర్శించి, ఓదార్పు చేసి రూ.20 వేలు చెక్కును ఆర్థిక సహాయంగా అందించారు. కష్టకాలంలో ఉన్న తమ కుటుంబానికి ఆసరాగా నిలిచిన మంత్రి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సేవా నిరతికి పలువురు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు చెప్పారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు టేకుమూడి సత్యనారా యణ, నాగరాజు, రాజేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల కార్యసాధన కోసం13న చలో ఐటిడిఏ కార్యక్రమం విజయవంతం చేయండి

**– గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** గిరిజన హక్కుల కార్యసాధన కోసం ఈనెల 13న రంపచోడవరం చలో ఐటీడీఏ కార్యక్రమంకు గిరిజన యువత, గిరిజనులు పెద్ద ఎత్తున తరలి రావాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు.ఏజెన్సీలో 100% ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని ఆదివాసులు హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న రంపచోడవరం ఐటీడీఏ వద్ద ఆదివాసి హక్కులు,ఉద్యోగాలు సాధన కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమాన్ని ఆదివాసీలు విజయ వంతం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు,ఆదివాసి హక్కులు,ఉద్యోగాల సాధన కమిటీ సలహాదారు లోతా రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీలో 100% ఉద్యోగాలు గిరిజనులు చే భర్తీ చేయాలని,మెగా డీఎస్సీ లో తీవ్ర అన్యాయం జరిగిన నేపథ్యంలో గిరిజన యువత ఇప్పటికైనా మేల్కోవాలని,ఏజన్సీ లో 100శాతం నియామకాలు చట్టం కోసం,పేసా చట్టం,అటవీ హక్కులు చట్టం,ఇతర గిరిజన హక్కులు, చట్టాలు అమలు కోసం గిరిజనులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని.ఈ నేపథ్యంలో 13న చలో ఐటిడిఏ కార్యక్రమానికి గిరిజన యువత,మహిళలు ప్రజాసంఘాల నాయకులు,ఆదివాసి గిరిజన సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో గిరిజనులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# సమగ్ర పరిశీలనతో మత్స్యకారులకు న్యాయం

## - రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హామీ










**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :**

మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర పరిశీలన జరిపి మూడు నెలల్లో పరిష్కారిస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశహాలులో రాష్ట్రఉపముఖ్యమంత్రి ఉప్పాడమత్స్యకార సోదరులతో మాట-మంతి కార్యక్రమాన్ని నిర్వహించి మత్స్యకార గ్రామాల పెద్దలు, యువత,మహిళలు,స్వచ్ఛంధసంస్థలతో ముఖాముఖి వారి సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆయనతో బాటు కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్,ప్రభుత్వ విప్‌లు దాట్లసుబ్బరాజు, యనమల దివ్య, ఎమ్మెల్సీలు పిడుగు హరి ప్రసాద్,కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, వనమాడి కొండబాబు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి అధికారులు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరక్టర్ మైలవరపు కృష్ణ తేజ, కాలుష్య నియంత్రణ మండలి మెంబర్-సెక్రటరీ ఎస్.శరవరణ్, మత్స్యశాఖ కమీషనర్ రామ్ శంకర్‌నాయక్, రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ కూడా కార్యక్రమానికి హాజరైయ్యారు.కార్యక్రమంలో తొలుత సముద్ర వేటలో ప్రమాదవశాన మరణించిన 18మంది మత్స్యకారులకు కుటుంబాలకు గ్రూప్ ఏక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ క్రింద తొలివిడతగా ఒక్కరికికీ 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 90 లక్షల ఎక్స్‌గ్రేషియా మొత్తాల చెక్కులను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంపిణీ చేశారు.అనంతరంనిర్వహించిన మాట-మంతి కార్యక్రమంలో ఉప్పాడ, కోనపాపపేట, అమీనాబాద్, మూలపేట తదితర మత్సకార గ్రామాల ప్రతినిధులు కె.రాంబాబు, కె.వెంకటరమణ, సిహెచ్.దావీదు, కొల్లి రాంబాబు, ప్రసాద్, సూరాడ రాజు, ముమ్మిడి జాన్సన్, కొండా వెంకటరమణ, బడే విజయకుమార్, పైడిపల్లి రాజు, మత్స్యకార యువకులు మోసా దేవుళ్ళు, వంకా ఎఫేజు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిది సతీష్, మత్స్యకార మహిళ ఉమ్మిడి అమరేశ్వరి పాల్గొని పారిశ్రామిక వ్యర్థాల వల్ల, ప్రకృతి వైపరీత్యాల వల్ల మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉపముఖ్యమంత్రికి వివరించి పరిష్కరించాలని వినతి చేశారు. సమస్యల పట్ల ఆవేదనతో తొందరపాటుగా ఆందోళనకు దిగినందుకు చింతిస్తున్నామని, ఉపముఖ్యమంత్రి పెద్ద మనసుతో తమ సమస్యలకు పరిష్కారం కల్పించాలని కోరారు.

**వారు ప్రస్తావించిన సమస్యలు :**

-ఉప్పాడ తీరంలోని ఎస్ఈజడ్ లో నెలకొల్పిన పరిశ్రమలు శుద్ది చేయకుండా తమ వ్యర్థాలను సముద జలాల్లో విడిచి పెడుతున్నందున గడచిన 4,5 సంవత్సరాలుగా మత్స్య సంపద క్రమేపి తరగి పోయి మత్స్యకారులు జీవనోపాధికి ముప్పుగా పరిణమిస్తోంది.

- ఈ ఏడాది రెండు నెలల పాటు వేట నిషేధ కాలం ముగిసి తరువాత వేటకు వెళ్లిన మత్స్యకారులకు సముద్రంలో చేపలు దొరకక ఆదాయం లేక అల్లాడుతున్నారు.

- మత్స్యకారులకు వేట నిషేధ కాలం విధించిన సమయంలోనే పరిశ్రమలకు కూడా వ్యర్థాల విడుదలపై నిషేధం విధిస్తే మత్స్య సంపదకు ముప్పు ఉండదు.

-కొత్తగా నిర్మిస్తున్న హార్బర్ డిజైన్ లోపాల వల్ల సముద్ర అలల కల్లోలం పెరిగి బోట్లు నిర్మాణాలకు గుద్దుకుని ప్రమాదాలు, ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి. హార్బర్ డిజైన్ లోపాల సవరణకు రిడిజైనింగ్ చేయించాలి.

-సముద్రంలో పరిశ్రమలు వేసిన పైపుల వల్ల వలలకు నష్టం వాటిల్లుతోంది.

-ఉప్పాడ, కోనపాప పేట వద్ద తీరం కోతకు గురి కావడం వల్ల మత్స్యకారులు ఇళ్లు కోల్పోతున్నారు. వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలి.

-ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న స్మశాన వాటిక సమస్య పరిష్కరించాలి.

-పరిశ్రమల ఏర్పాటుకు మత్స్యకారులు వ్యతిరేకం కాదని, అయితే పరిశ్రమల వల్ల తమ జీవనోపాధికి ముప్పు వాటిల్లకుండా కాపాడాలి.

-పరిశ్రమల వల్ల జీవనోపాధి ప్రభావితమౌతున్న మత్స్యకార కుటుంబాలకు యానం, ముమ్మిడివరం లలో ఓఎన్జీసి సంస్థ ప్రతి నెలా 11,500 రూపాయలు అందిస్తున్నట్లే ఉప్పాడ, తొండంగి ప్రాంత మత్స్యకారుల కుటుంబాలకు ప్రతి నెలా పరిహారం అందించాలి.

-మత్స్యకార కుటుంబాలలో చదువుకున్న యువతకు తీరంలో ఏర్పాటైన పరిశ్రమలలో ఇంటర్న్ షిప్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలి.

-సెప్టెంబరు నుండి నవంబరు వరకూ స్థానిక సముద్ర తీరంలో అలజడి వల్ల చేపల వేట సాధ్యం కాదని, ఈ సమయంలో పొరుగు ప్రాంతాల్లో వేటకు వెళ్లిన ఉప్పాడ మత్స్యకారులకు అంతర్వేది, మచిలీపట్నం తీరాలలో లాండింగ్ అయ్యేందుకు అక్కడి మత్స్యకారుల నుండి అభ్యంతరం వ్యక్తం అవుతోంది.

-మెకనైజ్డ్ బోట్లకు డీజిల్ సబ్సిడీ 3 వేల లీటర్ల వరకూ ఇస్తుండగా, వాటిలో వాడే ఇంజన్ల తరహా ఇంజన్లతోనే నడుపుతున్న ఫైబర్ బోట్లకు కేవలం 3 వందల లీటర్లకే ఇస్తున్నారు.

-ఉప్పాడ, కోనపాపపేట తీరంలో జియోట్యూబ్ కొట్టుకుపోయి అలల తాకిడికి ధ్వంసం అవుతున్న బీచ్ రోడ్, గ్రామల్లోకి చొచ్చుకొస్తున్న సముద్రం సమస్యలకు సత్వర పరిష్కారం అందించాలి.











ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మత్స్యకారుల సమస్యలను సావధానంగా ఆలకించి పరిష్కారంపై రాష్ట్ర, జిల్లా అధికారులతో చర్చించారు. ఉప్పాడ తీరంలో పరిశ్రమల వ్యర్థాలు సముద్ర జలాల్లోకలుస్తున్న అంశంపై ఎన్విరాన్మెంటల్ ఆడిట్ చేయిస్తామన్నారు. ఈలోగా మూడు రోజుల్లోపు కాలుష్య స్థాయిపై ప్రాథమిక నివేదిక అందజేయాలని రాష్ట్ర పిసిబి మెంబర్-సెక్రటరీని కోరారు. రెండు, మూడు రోజుల్లో మరో మారు వచ్చి సముద్రంలో వ్యర్థాలను వదులుతున్న ప్రదేశాలలో కాలుష్య పరిస్థితిని పరిశీలిస్తానన్నారు. నిర్మాణంలో ఉన్న హార్బరు డిజైన్ లోపాలపై ఐఐటి చెన్నై నిపుణల కమిటీ నివేదక ప్రకారం మత్స్యకార బోట్లకు ముప్పు లేకుండా డిజైన్ కరెక్షన్ చేయిస్తామన్నారు. రాష్ట్ర,దేశాభివృద్ధికి పరిశ్రమలు కూడా అవసరమేనని, అయితే ప్రజల జీవనోపాధికి విఘాతం, లోటు లేకుండా సమతౌల్యంపాటిస్తూ ముందుకు సాగాల్సి ఉందన్నారు. సాంప్రదాయ వృత్తులను కాపాడుతూనే మత్స్యకార యువతకు స్కిల్ డవలెప్మెంట్ ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉప్పాడబోట్ల లాండింగ్ అంశంలో అంతర్వేది, మచిలీపట్నం ప్రాంత మత్స్యకారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామ న్నారు. ఓఎన్జీసి తరహాలో పరిహారం అందించే అంశం పరిశ్రమలు, మత్స్య, కాలుష్య నియంత్రణ తదితర శాఖలతో ముడివడిన మల్టీ డిపార్టమెంటల్ అంశమని ఆయాశాఖలను సమన్వయపరచి నిర్ణయించాల్సి ఉందన్నారు. అలల కోత నుండి ఉప్పాడ తీరరక్షణకు అవసరమైన సుమారు 320 కోట్లు నిధులు కేంద్ర హెూంశాఖ నుండి విడుదల కావాల్సి ఉందని, ఇందుకు తాను స్వయంగా డిల్లీ వెళ్లి హెూం మంత్రి అమిత్ షా ను కలుస్తాని, వచ్చే రెండు, మూడు సంవత్సరాల్లో ఈ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తానని ఉపముఖ్యమంత్రి తెలిపారు. నాలుగైదేళ్లుగా సమస్యలతో సతమతమౌతున్నా అప్పుడు గళం విప్పని మత్స్యకారులుఇపుడు ఆందోళనకు దిగడం శోచనీయమన్నారు.మత్స్యకారుల సమస్యలకు కూటమి ప్రభుత్వం అంకితభావంతో చేస్తున్న కృషిని గుర్తించాలని కోరారు. మాట-మంతి కార్యక్రమంలో ప్రస్తావించిన సమస్యలను వచ్చే మూడు నెలలలోపు పరిష్కరిస్తామని హామీ ఇస్తూ, అందుకు సహకరించాలని ఉపముఖ్యమంత్రి మత్స్యకార ప్రతినిధులను కోరారు.

# నూతన జీఎస్టీ విధానంతో సామాన్య ప్రజలకు ఊరట

**– సూపర్ జీఎస్టీ –సూపర్ సేవింగ్స్ పై అవగాహన సమావేశం**
**– కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలతో సామాన్య ప్రజలకు మేలు కలుగుతుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఉమ్మడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రామచంద్రపురం నియోజవర్గ స్థాయి సూపర్ జీఎస్టి – సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలు, వ్యాపారుల వద్దకు వెళ్లి సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కరపత్రాలు అందచేసి, జీఎస్టీ నూతన సంస్కరణల ద్వారా చేకూరె ప్రయోజనాలను వివరించే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. జీఎస్టి స్లాబులు తగ్గింపుతో నిత్యవసరాలు వస్తువుల ధరలతో పాటు, సామాన్య ప్రజలకు సైతం ప్రయోజనం చేకూరేలా జీఎస్టీ రేట్లు తగ్గించారన్నారు. జీఎస్టి సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యయమని సత్యం పేర్కొన్నారు. ఈనెల 19 వరకు జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కలిగేలా అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపడుతున్నామన్నారు. జీఎస్టీ 2.0తో రాష్ట్ర ప్రజలకు 8 వేల కోట్ల మేర ఆదా అవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీ పై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు ఐకమత్యంతో, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ పలివెల ప్రకాష్ మాట్లాడుతూ మై టిడిపి యాప్ ఉపయోగం, వినియోగంపై అవగాహన కల్పించారు. పార్టీ చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు యాప్‌లో పొందుపరిచే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, కొమన వీర్రాజు, గరికపాటి సూర్య నారాయణ, ఉండవల్లి శివ, మేడిశెట్టి రవికుమార్, చవ్వాకుల నారాయణమూర్తి, పింకీ సాంబశివరావు, జాస్తి విజయలక్ష్మి, దొమ్మలపాటి విజయలక్ష్మి, బళ్ళ లక్ష్మి, నియోజకవర్గం టిడిపి పార్టీ నాయకులు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్చార్జిలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. తొలుత రాయవరంలో బాణాసంచా పేలి మృతి చెందినవారికి సభలో మౌనం పాటించి నివాళులు అర్పించారు.

# తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తడి, పొడి చెత్త సేకరణ పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ సూచించారు. రంపచోడవరం మండలం తాటివాడ గ్రామ పంచాయతీలో గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి చంద్ర శేఖర్ పర్యటించారు. ఇంటింటి కి చెత్త సేకరణ కార్యక్రమంపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ పై అవగాహన కల్పిస్తూ, ఇంటింటికి తిరిగి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. కాగా పంచాయితీ ఆస్తుల సంరక్షణ, మంచి నీటి సరఫరా, పారిశుధ్యం వంటి అంశాలపై బందపల్లి, తాటివాడ సర్పంచ్ లతో డిపిఓ మాట్లాడడం జరిగింది. అలాగే స్వర్ణ పంచాయితీ పోర్టల్ ద్వారా ఇంటి పన్ను వసూలు 100 శాతం వసూళ్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ, పరిపాలనాధికారి, డి.ఎల్. పి.ఓ సిబ్బంది, డిప్యూటీ ఎంపిడిఓ రాజు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, బందపల్లి, బొలగొండ సచివాలయం పరిధిలోని సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

# లొల్ల గ్రామాన్ని పంచాయితీలు ఆదర్శంగా తీసుకోవాలి





**– ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాన్ని అందుకున్న లొల్ల గ్రామాన్ని ఇతర గ్రామపంచాయతీలు ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్ళాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా పురస్కారం అందుకున్న లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, కార్యదర్శి, సిబ్బందిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.

గ్రామ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, పరిశుభ్రత మరియు శానిటేషన్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో వెంకట్ రామన్‌కు సూచించానని, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత లొల్ల గ్రామ అభివృద్ధి కోసం చేపట్టిన కొన్ని ముఖ్యమైన చర్యలు 562 మందికి తల్లికి వందనం జమ చేయడం, గ్రామస్తులందరికీ ఆదర్శప్రతిగా సేవ, 35 ఆటో డ్రైవర్లకు ఆటో డ్రైవర్ సేవ పథకంలో రూ.15,000 జమ చేయడం, వారి జీవనస్థాయిని మెరుగుపరచడానికి పారిశుధ్య కార్మికులకు దుస్తులు కొరకు రూ.10,000 అందజేయడం, వారికి మరింత సౌకర్యం కల్పించడానికి ఎమ్మెల్యే లొల్లను మోడల్ విలేజ్ లాగా అభివృద్ధి చేసి, రాష్ట్ర స్థాయి నుండి దేశస్థాయి వరకు, ముఖ్యంగా ప్రధానమంత్రి చేతుల మీదుగా పురస్కారం పొందేలా ఆకాంక్ష వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి రూ.10 లక్షల ప్రత్యేక గ్రాంట్ ను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయడం ద్వారా, గ్రామాన్ని పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి తాము కట్టుబడి ఉన్నామని వెల్లడించారు.

స్వచ్ఛ ఆంధ్ర – గ్రామీణ పరిశుభ్రతకు కొత్త దిశ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం, రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక ముఖ్యమైన పథకం. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, శానిటేషన్, ప్లాస్టిక్ రహితత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించబడుతోంది. గ్రామస్థులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై, తమ గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ టీ. రాజేశ్వరరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, కూటమి నాయకులు ముల్లపూడి భాస్కరరావు, మెర్ల శ్రీరామచంద్రమూర్తి, జోజవరపు హరిబాబు, మద్దూరు సుబ్బారావు, మేడిద సత్తిబాబు, పుత్ర సాయిరాం తదితరులు ఉన్నారు.

## హిందూ దేవాలయాల పరిరక్షణకు సహకరించాలి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** గిరిజన ప్రాంతాల్లో హిందూ దేవాలయాల పరిరక్షణకు, అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సహకరించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.కె.సైదా విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న దేవాలయాల స్థితిగతులను దేవాదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.కె.సైదా (విజయవాడ) గురువారం పరిశీలించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ వారు గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లో మంజూరు చేసిన దేవాలయములు నిర్మాణ స్థితిగతులను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షణ నిమిత్తం ఆయన సందర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వేంకటేశ్వరరావు డిఈతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతంశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హిందూ దేవాలయాలు లేని ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న ఆలయ నిర్మాణాలు ఆదివాసీ గ్రామస్తులు సమైక్య నిర్ణయాలతో జరగడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం హెచ్‌డిపీపీ కోఆర్డినేటర్, వి.హెచ్.పి. జిల్లా సత్సంగ ప్రముఖ్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి, వి.హెచ్.పి. జిల్లా కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణ కిశోర్, శ్రీ విరాట్ విజయ ఆంజనేయస్వామి సహిత శ్రీ కోదండ రామాలయం ఆలయ కమిటీ సభ్యులు, హిందూ ధార్మిక సంస్థల కార్యవర్గ సభ్యులు, ఆలయ నిర్మాణ మేస్త్రీలు, ఆలయ నిర్మాణ శిల్పులు పాల్గొన్నారు.

## శ్రీ సత్య దేవుని దర్శించుకున్న హరే కృష్ణ గ్లోబల్ టెంపుల్ బృందం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం ఆంధ్ర మరియు తెలంగాణ అక్షయపాత్ర రీజనల్ ప్రెసిడెంట్ మరియు హరే కృష్ణ గ్లోబల్ టెంపుల్ శ్రీమాన్ సత్య గౌర చంద్ర దాస బృందం సన్నిధికి విచ్చేశారు. వీరికి దేవస్థానం ఆలయ కార్యనిర్వాహనాధికారి వీర్లసుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఈవో సుబ్బారావు శ్రీ స్వామివారి శేష వస్త్రము, ప్రసాదమును, శ్రీ స్వామివారి చిత్ర పటమును అందజేశారు.

## మందులపై తగ్గించిన జీఎస్టీ వల్ల ఎంతో మేలు జరుగింది

**– మాజీ బీజేపీ అధ్యక్షులు యాళ్ల దొరబాబు**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** పేద ప్రజలకు మందులపై తగ్గించిన జీఎస్టీ వల్ల ఎంతో మేలు జరుగుతుందని ఇకపై ఆరోగ్య సంరక్షణ సులభతరం అని, సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అని బిజిపి కోనసీమ జిల్లా పూర్వపు అధ్యక్షులు యాళ్ల దొరబాబు అన్నారు. అల్లవరం మండలం ప్రభుత్వ వైద్యశాల వద్ద గురువారం జన ఔషధములపై జిఎస్టి తగ్గించడం పట్ల జిఎస్టి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిఎస్టి తగ్గించిన కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ అనేక రకములైన వస్తువులపై జిఎస్టి తగ్గించడం జరిగిందని ఈ జీఎస్టీ తగ్గించడం వలన ప్రజలపై భారం తగ్గటమే కాకుండా వారి ఆర్థిక స్థితిగతులను మెరుగు పడతాయని దొరబాబు అన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషారావుతో పాటు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్యాల రామకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలి





**– ఐటీడీఏ పివో స్మరణ్ రాజ్**

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వపాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాల్లో రిజిస్టర్లు పక్కాగా నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ ఆదేశించారు. రంపచోడవరంమండలం ముసురుమిల్లి గ్రామంలో సచివాలయం,అంగన్వాడీ కేంద్రం, సబ్ సెంటర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి గురువారం ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. సచివాలయం పరిధిలో ప్రజలకు వివిధరకాలసేవలు సకాలంలోఅందించాలని, అదేవిధంగా వివిధ రకాలరికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా చిన్న బారంగి అంగన్వాడీ కేంద్రంలో బాల బాలికలకు ఆటపాటలతో చదువుపై మక్కువ ఉండే విధంగా విద్యను బోధించాలని, అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసే ఆహార పదార్థాలు సక్రమంగా అందజేయాలనిఆయన అన్నారు. అదేవిధంగా సబ్ సెంటర్ ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించి ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది, ఎంతమంది బాలింతలు ఉన్నది ఆయన ఆరా తీశారు. అంగన్వాడీ విద్యార్థులకు కంటి పరీక్షలు, విటమిన్ పరీక్షలు ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. వివిధ రకాల మందులు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఈ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో పర్యటించాలన్నారు. అనంతరం రంపచోడవరంలో జిసిసి గోదాంను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ప్రతినెల ఎన్ని మెట్రిక్ టన్నుల బియ్యం వస్తున్నది, అదేవిధంగా వివిధ రకాల నిత్యావసర వస్తువులు ఏవి వస్తున్నాయి, అదేవిధంగా గోదాంలో ప్రస్తుతం ఎన్ని బస్తాల బియ్యం ఉన్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. జిసిసి గోడౌన్లలో రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా రంపచోడవరంలో అంబేద్కర్ సెంటర్ దగ్గర్లో ఉన్న మండల పరిషత్ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నది, అదేవిధంగా ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది ముందుగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనలం ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం పక్కాగా అమలు చేయాలని, అదేవిధంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్యను బోధించాలన్నారు. స్కూలుకు సంబంధించిన రికార్డులు పక్కాగా అమలు చేయాలని ఆయన అన్నారు. అనంతరం పందిరి మామిడి సెంటర్ సమీపంలోని వీడి వీకేలు నిర్వహిస్తున్న జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సంవత్సరం ఎన్ని మెట్రిక్ టన్నుల జీడిపిక్కలు కొనుగోలు చేసింది, అదేవిధంగా ప్రతిరోజు ఎన్ని కేజీలు జీడిపిక్కలు ప్రాసెసింగ్ చేయుచున్నది ఆయన ఆరా తీశారు. ప్రాజెక్ట్ అధికారి వారి వెంట అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ డేవిడ్, సిడిపిఓ కె.ఉమా, వెలుగు అధికారులు, జిసిసి అధికారులు పాల్గొన్నారు.

# రాయవరం అగ్ని ప్రమాదంపై మాజీ ఎంపి చింతా తీవ్ర దిగ్భ్రాంతి



**– మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి**

**అమలాపురం, మేజర్ న్యూస్ :** మృతుల కుటుంబాలకు వెంటనే కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ డిమాండ్ చేసారు. నియోజకవర్గం రాయవరం మండలం, కొమరిపాలెం గ్రామంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ అన్నారు. ఈ దురదృష్టకర ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోని, ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అలాగే ఘటనలో గాయపడినవారికి కూడా నష్టపరిహారాన్ని ఇచ్చి, మెరుగైన వైద్య చికిత్స అందించాలని అనురాధ డిమాండ్ చేశారు. చనిపోయినవారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఆదిత్య విద్యార్థినుల ప్రతిభ








**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు జిల్లా యువజన మరియు క్రీడా శాఖా అధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025 చురుగ్గా పాల్గొని వివిధ అంశములలో బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ జిల్లాయువజన సంక్షేయ శాఖ సెట్రాజ్ వారి అధ్వర్యములో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు-2025లో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తకళలు, జానపద గేయాలు, జానపద నృత్యం, కవిత్వం, పెయింటింగ్, కథల పోటి, సైన్స్ అండ్ టెక్నాలజిలో ఆవిష్కరణ నేపథ్య పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ పి.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల వేదికగా నిర్వహించిన పోటిలలో తమ విద్యార్థినులు ప్రతిభ చూపారు అని తెలుపుతూ, సైన్స్ అండ్ టెక్నాలజి ఆవిష్కరణ నేపథ్య పోటీలలో కె.వి. లక్ష్మీ పాల్గొని, మహతి, ధన వర్షిణి ద్వితీయ బహుమతి, కవిత్వంలో లక్ష్యాలహారి ద్వితీయ బహుమతులు గెలుపొందారు. బహుమతులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. అలాగే ఈ కార్యక్రమానికి విద్యార్థినులను ప్రోత్సహించిన కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మరియు ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖదేవి, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నవ్య మరియు కాకినాడ సెట్రాజ్ విభాగాన్ని అభినందించారు.

## దేవీపట్నం పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎస్పీ



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** దేవీపట్నం (ఇందుకూరుపేట) పోలీస్ స్టేషన్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో గంజాయి అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు గంజాయి రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు నిర్వహణ ద్వారా ప్రజలతో పోలీసులు మంచి సంబంధాలు కొనసాగించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట రంపచోడవరం డిఎస్పీ జి.సాయి ప్రశాంత్, సిఐ ఎన్.సన్యాసి నాయుడు, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తదితరులు ఉన్నారు.

## జీఎస్టీ సర్దుబాటు అన్ని వర్గాలకు వెసులుబాటు

**– ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ సర్దుబాటు నిర్ణయంతో దేశవ్యాప్తంగా అన్నీ వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెదేపా నాయకుడు మధు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేష్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో జీఎస్టీ సర్దుబాటుపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు కనీతి మధు, రమేష్ మాట్లాడుతూ వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో లభించే టాబ్లెట్లు, అలాగే మనం రోజు వాడే నిత్యవసర వస్తువులు రైతు వాడే పరికరాలు ఎన్నో రకాల వస్తువులపై జిఎస్టి తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రజల అందరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు మురళీ, ఆసుపత్రి సిబ్బంది, ఆశ సిబ్బంది, గ్రామస్తులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి శ్రామికుల ఇకెవైసి 57శాతం పూర్తి



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలంలోని ఉపాధి శ్రామికుల ఇకెవైసి 57శాతం పూర్తి అయినట్లు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ జెఇ సతీష్‌కుమార్ మరియు ఎపిఓ సుధీర్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ఎపిడి భానుప్రకాష్, ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణల ఆదేశాల మేరకు పెద్దాపురం మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో 10,570 మంది ఉపాధి శ్రామికులు పనిచేస్తున్నారని, వీరిలో 7210 మందికి ఫేస్ యాప్ ద్వారా ఇకెవైసి చేయడం జరిగిందని, వారు తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో ఇకెవైసి పూర్తి చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితాలో అవకతవకలను పరిష్కరించాలి

**– ఏలేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఓటర్ల జాబితాలో నెలకొన్న అవకతవకలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏలేశ్వరం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ నీరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఓటర్ జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా సంతకాల సేకరణ చేసి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ సందర్భంగా 400 మంది ప్రజల నుంచి సంతకాలు సేకరించినట్లు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన ఓటు హక్కును దుర్వినియోగం చేయడం దారుణమన్నారు. సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. ఫోటోతో స్పష్టమైన ఓటర్ జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు సంబంధించిన వివరాలు బహిరంగపరచాలన్నారు. తొలగించిన ఓట్లలో తప్పులు దొర్లితే సమస్యను తక్షణ పరిష్కారానికి ఫిర్యాదు వ్యవస్థ అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికలకు చివరి నిమిషంలో ఓట్ల తొలగింపు లేదా మార్పులను నివారించాలని స్పష్టమైన కటాఫ్ తేదీని ముందుగానే ప్రకటించాలన్నారు.

ఉద్దేశ్య పూర్వకంగా ఓట్ల తొలగింపుగా పాల్పడిన అధికారులు ఏజెంట్ల పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను కేంద్ర ఎన్నికల కమి షన్ ముందు పెడుతామని వివరించారు. కార్యక్రమంలో ధర్నాలకోట శ్రీను, ఎం.చక్రరావు,చోడిశెట్టి సత్యనారాయణ, పలువురు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావుకు పలువురి పరామర్శ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు తండ్రి రామవరం గ్రామ సీనియర్ టిడిపి నాయకులు అడబాల ముసలయ్య (చంటి) అనారోగ్యంతో కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ అక్టోబర్ 7వ తేదీ మృతి చెందారు. అడబాల వెంకటేశ్వరరావును పరామర్శించేందుకు కూటమి నాయకులు, అధికారులు ప్రజలు జగ్గంపేట మండలం రామవరం గ్రామంలోని ఆయన స్వగృహానికి వస్తున్నారు. గురువారం కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, గండేపల్లి వైస్ ఎంపీపీ కుంచే రాజా, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, కొత్త భైరవకృష్ణ, క్లస్టర్ ఇన్చార్జి పైడిపాల సూరిబాబు, భూపాలపట్నం ప్రసాద్, కాకినాడ జిల్లా టిడిపి మీడియా కోఆర్డినేటర్ ఉండవల్లి వీర్రాజు, తిరుమలరాజు మురళి రాజు, జగ్గంపేట మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, జగ్గంపేట పంచాయతీ సెక్రెటరీ శివ, అడ్వకేట్ దంతులూరి కృష్ణంరాజు, డ్రిల్ మాస్టర్ శ్రీను, కింగం రామకృష్ణ, పల్లికొండ భద్రం, తొట్టిపూడి నాగేశ్వరరావు, మంతెన రవిరాజు, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ఏపీవో జీవీ రమణ కుమార్, రామవరం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయ కమల్ తదితరులు అడబాల చంటి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించి వెంకటేశ్వర రావుకి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## గోదావరి మహా పుష్కరాల కోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

**– ఆర్డీవో రాణి సుస్మిత**
**– భక్తుల సౌకర్యాల కోసం సమగ్ర చర్యలు చేపడదాం**
**– ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** గోదావరి మహా పుష్కరాలు – 2027 నిర్వహణ నేపథ్యంలో కొవ్వూరు పట్టణం పరిధిలో అభివృద్ధి పనుల విషయంలో ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో 2027 గోదావరి మహా పుష్కరాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ 2027 గోదావరి మహా పుష్కరాల ఏర్పాట్లు, మౌలిక వసతులు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. 2027లో గోదావరి పుష్కరాలు రానున్న తరుణంలో ఏర్పాట్లను ముందస్తుగా పక్కా ప్రణాళికలతో సిద్ధం చేయాలని సూచించారు. కొవ్వూరు డివిజన్‌లో ప్రధానంగా 48 పుష్కర ఘాట్లు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో నిర్మాణ పనులకు నివేదికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్‌లో 67 దేవాలయాల అభివృద్ధికి మొదటి విడతగా ?9.87 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు ఆమె వెల్లడించారు. ఇకపై వారానికి ఒక్కసారి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా ఉండడం వల్ల భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కొవ్వూరు నియోజకవర్గం వైపు కూడా భక్తులను పంపేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ , తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాలకి చెందిన వారు కూడా కొవ్వూరు లో పుణ్య స్నానాలు ఆచరించడానికి రావడం జరుగుతుందని తెలియ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర ఏర్పాట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తున్నారని, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక మంత్రుల కమిటీ ఏర్పాటైనట్లు తెలిపారు. ఆ కమిటీ ముందు కొవ్వూరు డివిజన్ పరిధిలో ప్రతిపాదిత పనుల సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. ఘాట్ల అభివృద్ధి, దేవాలయాల మరమ్మతులు, భక్తుల సౌకర్యాల కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద అభివృద్ధి పనులకు టూరిజం శాఖతో ప్రణాళికలు సిద్ధం చేయమని తెలిపారు. కొవ్వూరు పట్టణ అభివృద్ధికి ఇది మంచి అవకాశం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని, డీఎస్పీ దేవ కుమార్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి పీవీ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ కే. ఆనందబాబు, తహసీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏపీఎన్‌జిజిఒ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ ఏపీఎన్‌జిజిఒ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎపిఎన్ జిజిఒ అసోసియేషన్ ఇంచార్జి అధ్యక్షులు మటపర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఏపీఎన్‌జిజిఒ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు అలపాటి విద్యాసాగర్, సెక్రటరీ డి.వెంకటరమణ, ఉపాధ్యకులు పసుపులేటి శ్రీనివాసు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిస్కారం కోసం అలుపెరుగని పోరాటం చేస్తుందని వెంటనే పిఆర్‌సి కమిషన్ నియమించి ఐఆర్ ప్రగటించాలని, పెండింగ్ డిఆర్‌లు విడుదల చెయ్యాలని, సంఘం తాలూకా లెవెల్ నుండి పటిష్టం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆడాక్ కమిటీ అధ్యక్షులుగా మాధవరపు వెంకటేశ్వర్లు, కన్వీనర్‌గా గుత్తుల వెంకటేశ్వరావు, కోశాధికారిగా గుర్రాల సురేష్ సింగ్, మెంబెర్స్‌గా తాడి ఏసుబాబు, రూతమ్మ, సిహెచ్ చిట్టిబాబు, పి.రవిని రాష్ట్ర అధ్యక్షులు నియమించారు. తాలూకా బాడీ ఎన్నికల జరిపించి జిల్లా ఎన్నికలు జరిపించు వరకు ఈ ఆడాక్ కమిటీ కొనసాగుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ మరియు కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 21 తాలూకా యూనిట్స్ కార్యవర్గ సభ్యులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెంక్షనర్స్ సంఘాల అధ్యక్ష, కార్యదర్శిలు, కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెంక్షనర్స్ పాల్గొన్నారు.

## పెద్దేవం గ్రామంలో గేదెల ఆకస్మిక మరణాలపై పరిశీలన

**– నివారణ చర్యలు ప్రారంభం –కలెక్టర్ కీర్తి చేకూరి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పెద్దేవం గ్రామంలో గేదెల ఆకస్మిక మరణాల ఘటనపై జిల్లా యంత్రాంగం సమగ్ర పరిశీలన చేపట్టినట్లు , పశు సంవర్ధక శాఖ నిపుణుల బృందాలు గ్రామంలో స్థల పరిశీలన నిర్వహించి, నమూనాలను సేకరించి ప్రయోగశాలల పరిశీలనకు పంపినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక నివేదికల ప్రకారం, పరాన్నజీవి వ్యాధులు మరియు వైరల్ ఇన్ఫెక్షన్‌ల సమ్మేళనమే ప్రధాన కారణంగా గుర్తించబడిందని, బాధిత పశు వులకు అవసరమైన వైద్య సహాయం, డీవార్మింగ్ మరియు కీటక నియంత్రణ చర్యలు తక్షణమే ప్రారంభించబడినట్లు ఆమె తెలిపారు. గ్రామంలోని పశువులందరికీ ఉచిత వైద్యం, సలహాలు అందించేందుకు మొబైల్ వెటర్నరీ టీమ్‌లను పంపినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణను బలోపేతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. రైతులు తమ పశువుల్లో ఏవైనా అనారోగ్య లక్షణాలు గమనించిన వెంటనే సమీప వెటర్నరీ వైద్యుడు లేదా గ్రామ సచివాలయ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం పశువుల ఆరోగ్య రక్షణ, రైతుల ఆర్థిక భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వానికి తగిన సిఫారసులు పంపిందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పశువుల పెంపకం దారులు చెరువులు, బురద ప్రాంతాల్లో పశువులను మేపవద్దని, గొర్రెలు%-% మేకలతో కలిపి మేపకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశుసంవర్ధక అధికారి టి. శ్రీనివాస్ రైతులకు సూచించారు. డీవార్మింగ్, టీకాలు, కీటక నియంత్రణ కార్యక్రమా లను నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రైతాంగం జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలని, పశువుల ఆరోగ్య సంరక్షణ సంబంధించి సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేసారు.

